# న్యాయమూర్తి

— ఆచార్య

మొదటిఆట సినిమా అప్పుడే విడిచి పెట్టినట్టున్నారు, జనం అంతా రోడ్డుమీదే వున్నారు. మర్నాడు సెలవు రోజు అవటాన రెండవ ఆటకు వెళదామని బయలుదేరిన జనం మొదటి ఆటకు వెళ్లివస్తూన్న జనానికి రెట్టింపుగావున్నారు. ఎవరికి వారు వారివారిహడావిడిలో నిమగ్నమయి రోడ్డుమీద నడవవలసిన వాహనాల నన్నింటిని డ్రామాను చూసే ప్రేక్షకుల్లా నిశ్చలంగావుండేట్లు చేశారు జనం. కదులుదామన్న ప్రయత్నంలో కొన్ని కార్లు చేస్తున్నశబ్దం ప్రజలు చేస్తూన్న శబ్దం ముందు చవకబారుగావినిపిస్తూంది. ఇంతలో ప్రతివారి చెవులను ఎటెన్షన్ లోకితెస్తూ గణ గణ గణ శబ్దం వినిపించింది దూరంనుంచి. ప్రజలు మాటలు కదలికలు ఆపివేసి శబ్దంవస్తూన్నవేపే చూస్తూ నుంచునుండిపోయారు.

చిన్నికృష్ణుణ్ని తలపైన ఎత్తుకుని అర్థరాత్రివేళ వస్తూన్న వసుదేవుడ్ని చూసి అదేదోనది గోదాదేవిఅని జ్ఞాపకం, తనకు తానే రెండుగా పగిలి మధ్యలో ఖాళీ ఏర్పరచి వసుదేవుడ్ని వెళ్ళనిచ్చినట్టు, అక్కడున్న ప్రజలను ఛేదించుకుంటూ ముందుకు సాగిపోయింది ఫైర్ ఇంజన్ సినిమాస్ట్రీట్ గుండా.

"ఎక్కడో నిప్పంటుకున్నట్టుంది."

"అసలే ఎండాకాలం. వర్షాకాలంలోనే ఇళ్లకు నిప్పంటుకునే ఈఊళ్లో ఎండాకాలంలో కాలటం వింతేమిటి?"

"వింత అనికాదు. పాపం తగలడిపోయింది అన్న ఆర్ద్రత."

"తగలడిపోయిందంటే పాపం ఎందుకవుతుంది?''

ఫైర్ ఇంజన్నుచూసి రకారకాలుగా మాట్లాడుకున్నారు.వాళ్లమాటలేవీపట్టించుకోకుండా సినిమా రోడ్డు మలుపును తిరిగి సందులోంచి ఒకపెద్దఖాళీస్థలంలో మధ్యగావున్న పాకముందు ఆగింది ఫైర్ ఇంజన్.

పాక నింగిని అంటుతూన్న మంటలతో నిండివుంది. పాక ముందు చుట్టుపక్కలవాళ్ళు దారినేపోతూన్నవాళ్లు చాలమంది గుంపుగాచేరి ఆహుతి అవుతూన్న పాకను చూస్తున్నారు. కొందరు ఉడతాభక్తిగా బిందెలతో కుండలతోనీళ్ళు తెచ్చి పోస్తున్నారు, మంటలమీద.

"ఎవరిదండీ యిల్లు?"

"న్యాయమూర్తిది."

"న్యాయమూర్తా!"

"అవునండీ. ఆ ముసలాడు మొన్ననే షష్టిపూర్తి కూడాచేసుకున్నాడు. అతనిది"



"అయ్యో పాపం. ఇంట్లో ఒక్కడే వుండాడా ?"

"ఆయనకూతురు ఒక విధవ ఆమె. ఏడాదిలోపు కొడుకు కూడా ఇంట్లోనే వున్నారట."

"వాళ్లంతా ఇంట్లోవుండ గానే ఇంటికి నిప్పంటుకుందా !"

"అవునండీ. అంతా ఇంట్లోనే వున్నారట."

"నిప్పెలా అంటుకుందబ్బా !"

"అదే నాకూ అంతు చిక్కటం లేదండీ."

"ఎవరైనాపోయి లోపల్నుంచివాళ్లను బైటకుతెస్తే బాగుండు."

"అంతపాటి మంటల్లోకి ఎవరని వెళ్ల గలరండీ. ఆ ఫైర్‌వాళ్ళే వెళ్లాలి."

అక్కడ జేరిన వాళ్ల మాటలు ఆగి పోయాయి; ఇంటి గుమ్మంలోంచి కుర్రాడ్ని నోటినకరచుకుని మంటల్లోంచి బైటకు వస్తూన్న కుక్కను చూడ టంతో !

"అయ్యో! అయ్యో. కుర్రాడు చచ్చి పోతాడు" కుక్క నోట్లోని కుర్రాడ్ని చూసి అరిచాయి కొన్ని ఆడగొంతుకలు

ఎదురుగా నుంచునున్న మనుషుల దగ్గరకొచ్చి కుర్రాడ్ని నేలమీదవుంచి నాకుతూ నుంచుంది కుక్క రెండు నిమిషాలపాటు.

ప్రజల కోలాహలంలో కుర్రాడి ఏడుపు పైకి వినిపించకపోయినా ఎవరో స్త్రీ ఆ దృశ్యాన్నిచూసి కుర్రాడ్ని తనచేతుల్లోకి తీసుకుంది.

"అదిన్యాయమూర్తి పెంపుడు కుక్క ఎంత విశ్వాసంగలదో ?" చూపరులలో ఒకరు కుక్కను మెచ్చుకున్నారు.

"తప్పుకోండి ... తప్పుకోండి." అంటూ ఫైర్ ఇంజన్ తాలూకు ఫైర్ సర్వీస్‌మన్ పైపుల్నితీసుకుని మంటల మీదకు నీళ్ళువదులుతున్నారు. కొందరు ఇంటి గుమ్మంలోనుండి లోనికి వెళ్ళటానికి ప్రయత్నిస్తున్నారు.

"లోపల ఎంతమంది వున్నారు ?" ఫైర్‌సర్వీస్‌మెన్‌లోని ఒక అధికారి అక్కడి జనంలో ఒకరిని అడిగాడు.

"న్యాయమూర్తి అతని కూతురు వున్నారండీ". ఎవరో తనకు తెలిసిన వైనం చెప్పారు. "న్యాయమూర్తంటే లాల్‌బహదూర్ శాస్త్రికన్న పొట్టిగా, ఇంకా సన్నగా అస్థిపంజరంలావుంటాడూ వాడిపోయి రాలిపోవటానికి సిద్ధంగా వున్నట్టు అగుపిస్తాడు, ముదుసలి. ఎప్పుడైనా నడుస్తూ కనిపిస్తాడు. ఈసందులో అతనే కదూ" న్యాయమూర్తిని గుర్తు చేసుకుంటూన్న ఒక పెద్దమనిషి మాటలు.

"అవును...అవును, అతడే" మరొక పెద్దమనిషి సమాధానం.

ఫైర్ సర్వీస్‌మన్ కాలిపోతూన్న పాకలోనుంచి న్యాయమూర్తి విధవ కూతుర్ని వళ్లంతా కాలిపోయి స్పృహ కోల్పోయివున్న స్థితిలో బైటకు తీసుకువచ్చి ఆంబులెన్సులో ప్రభుత్వ ఆసుపత్రికి పంపించారు. ఆమెఆంబులెన్సులో వెళ్లేవరకూ ఆ కారు దగ్గరే వున్నకుక్క ఒక్కసారిగెంతి పరుగున తగలబడుతూన్న పాకలోనికి వెళ్లింది.

"ఎలాగయినా విశ్వాసంగల జంతువు గురూ. చూడు న్యాయమూర్తికోసం మంటల్లోకి పోయింది." కుక్కనే పరీక్షగా చూస్తున్న ఒకతని మాటలు.

ఫైర్‌ఇంజన్ ఎంతనీరు గుమ్మరించినా పాక పూర్తిగా దగ్ధమయేవరకూ మంటలను ఆర్పలేకపోయింది.

"అసలింతకీ నిప్పెలా అంటుకుందో తెలవనేలేదు".


"అది బైటకు చెప్పకూడదండీ... చిదంబర రహస్యం."

"ఏమిటో ?"

"ఏమిటంటే మన పెదకాపులేడూ ..."

"ఆఁ."

"ఆ పెదకాపుకీ అతని దగ్గర పని




చేస్తూన్న పాతేరుకి పొలం విషయంలో తగాదా వచ్చింది గదా."

"అవునవును."

"ఆ తగాదా పాలేరు పక్షంలో తీర్పు చెప్పాడట ఉదయం పంచాయతీలో న్యాయమూర్తి."

న్యాయమూర్తిమాటకి మిగతావారంతా తందానా అన్నారట. దానికి ఫలితం.."

"అయ్యో పాపం."

"పాపం కాదండీ. చూడండి న్యాయమూర్తి కళేబరం ఎలా కనిపిస్తూందో."

"అవునవును. పక్కనే ఆ చిన్న బొమికల కుప్పేమిటి?"

"అయ్యో పాపం! చూడలేదా! ఇందాక లోపలకి పోయిన కుక్కది."

"రామ రామ!! ఎంత ఘోరం జరిగింది!"

"ఏదేమయితేనేం న్యాయమూర్తి పోయాడు పాపం?"

"పదండి పదండి." అప్పుడేఅక్కడికొచ్చి చేరిన పోలీస్ వాన్‌లోంచి పోలీసులుదిగి అక్కడ చేరిన జనాన్ని తరిమి వేశారు.

నిప్పు పూర్తిగా ఆరిపోయిందని నిర్ధారణచేసుకుని విశ్రాంతిగా గంట ఒక టొకటే కొట్టుకుంటూ ఫైర్ ఇంజన్ వెళ్లిపోయింది. హాస్పటల్లోని న్యాయమూర్తి కూతురికి స్పృహరావటంకోసం కాగితం కలంతో ఎదురుచూస్తున్నారు పోలీసు ఆఫీసర్లు, డాక్టర్లు, వేయికళ్ళతో!

కుక్క పళ్ళగాట్లతో బాధపడుతూ ఏడుస్తున్నాడు పసికుర్రాడు హాస్పటల్లోని మరొక వార్డులో!

పోలీసులు మాత్రం ఇంకా ఆ తగలపడ్డ పాక శిథిలాలను — న్యాయమూర్తి అస్థిపంజరాన్ని, కుక్క బొమికలను కాపలా కాస్తూనే వున్నారు.

—— ——